క్లుప్తంగా

క్రైస్తవ శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి



కలెక్టర్ మల్లికార్జునకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలస్వామి తదితరులు

మహారాణిపేట : క్రిస్టియన్ శ్మశాన వాటికకు 10 ఎకరాల స్థలం కేటాయించాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ విభాగం క్రిస్టియన్ ఎఫైర్స్ సలహాదారు డాక్టర్ ఎం.బాలస్వామి కలెక్టర్ మల్లికార్జునకు విజ్ఞప్తి చేశారు. గురువారం క్రైస్తవ సంఘాల నాయకులతో పాటు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. క్రైస్తవులు శ్మశాన వాటిక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీ క్రిస్టియన్ లీడర్స్ ఫోరమ్ చైర్మన్ ఆలీవర్‌రాయి, ఏఈఎల్‌సీ ప్రతినిధి రెవరెండ్ జేమ్స్ శ్రీకాంత్, విశాఖ సిమెట్రీ బోర్డ్ కార్యదర్శి జి. మాథ్యూపీటర్, బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ ప్రతినిధి పి. ఇమ్మానుయేల్ ఉన్నారు.

రథం లాగిన జాలర్లకు ఎమ్మెల్యే చిరుకానుక



జాలర్లకు చిరుకానుక అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: గత 165 ఏళ్లగా వంశపారంపర్యంగా జగన్నాథస్వామి రథం లాగే జాలర్లకు ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం చిరుకానుక అందించారు. టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి రథయాత్రలో ఆలయం నుంచి టర్నర్ చౌల్ట్రీ కల్యాణ మండపం వరకు స్వామి రథాన్ని లాగిన జాలర్లకు రూ.5 వేల చిరుకానుక అందజేశారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

అక్కిరెడ్డిపాలెం: విశాఖపట్నం జిల్లాలోని నిరుద్యోగ యువతకు మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల మండలి ప్రధాన కార్యాలయంలో కార్పెంటర్ మరియు ఎలక్ట్రికల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు విశాఖ జిల్లా ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల మండలి సహాయ సంచాలకులు డాక్టర్. వి.పద్మ గురువారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని, అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తారని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసుకున్న యువతకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) ద్వారా రుణఅవకాశం కల్పిస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపయోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 90596 65146, 80087 15357 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

షిర్డీసాయిబాబాకు లక్ష పుష్పార్చన



పుష్పాలంకరణలో సాయినాథుడు

సీతమ్మధార: గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని షిర్డీసాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో ఉదయం బాబాకు పంచామృతాభిషేకం, విశేష అర్చనలు జరిపారు. గులాబీ, మల్లె, చామంతి, విరజాజీ తదితర లక్ష పుష్పాలతో సాయినాథుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అర్చక బృందం, సిబ్బంది శివకుమార్, వనజాక్షి పాల్గొన్నారు.

అభివృద్ధి.. అదుర్స్

- పూర్ణామార్కెట్‌లో ఏర్పాటైన మౌలిక సదుపాయాలు
- రహదారులు.. డ్రైనేజీల నిర్మాణం
- స్థానికులు, వ్యాపారుల హర్షం

గత ప్రభుత్వాలు ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యం చేసిన పూర్ణామార్కెట్‌ను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి బాట పట్టించింది. ఇక్కడ రోడ్లు నిర్మించి, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడంతో స్థానికులు, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పూర్ణామార్కెట్ వద్ద మురుగు నీటిలోనే నడిచి వెళ్తున్న ప్రజలు (ఫైల్)



జీవీఎంసీ బీటీ రోడ్డు నిర్మించాక సులువుగా రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

జగదాంబ: పాతనగరంలోని పూర్ణామార్కెట్‌కు ఎనలేని చరిత్ర ఉంది. నగరం ఆధునికతను సంతరించుకోక ముందు టౌన్‌గా పిలవబడుతూ ఎంతో అభివృద్ధి సాధించింది. అప్పట్లో అభివృద్ధితో అలరారిన ఈ ప్రాంతం తర్వాతి కాలంలో రోడ్లు, డ్రైనేజీలు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతూ ఉండేవారు. అప్పటి ప్రభుత్వాలు ఏనాడూ ఈ ప్రాంతం అభివృద్ధిపై దృష్టి సారించలేదు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో సరైన రోడ్లు లేక, డ్రైనేజీ సౌకర్యం లేక పూర్ణామార్కెట్ స్థానికులతో పాటు ఇక్కడ పెద్ద ఎత్తున వ్యాపారాలు చేసేవారు కూడా నానా అగచాట్లు పడేవారు. 35వ వార్డు పరిధిలోకి వచ్చే ఈ ఏరియా లోతట్టు ప్రాంతం కావడంతో చిన్నపాటి వర్షం వచ్చినా ముంపునకు గురయ్యేది. కేజీహెచ్ నుంచి వచ్చే మురుగు నీరంతా పూర్ణామార్కెట్ రహదారి గతుకుల్లోనే నిలిచిపోతుండేది. దీంతో రహదారికి ఇరువైపుల వ్యాపారాలు చేసుకునే వారందరూ ఆ మురుగులోనే వ్యాపారాలు చేసుకుంటూ చర్మవ్యాధులతో పాటు పలు రుగ్మతలకు గురయ్యేవారు.

ప్రభుత్వం చొరవతో...

ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నగరంలోని అన్ని వార్డులతో పాటు 35వ వార్డు పరిధిలోకి వచ్చే పూర్ణామార్కెట్‌ను కూడా అభివృద్ధి చేసింది. ఇక్కడ రహదారులు నిర్మించారు. పూర్ణామార్కెట్‌తో పాటు స్ప్రింగ్‌రోడ్డు, బౌడారారోడ్డు తదితర ప్రాంతాలకు చెందిన వీధుల్లో రహదారి నిర్మాణంతో పాటు ఎంతో కాలంగా తీరని సమస్యగా ఉన్న యూజీడీ సమస్యను కూడా పరిష్కరించారు. దాంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు.

పథకాలతో పాటు.. అభివృద్ధి పనులు చేస్తున్నారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల కోసం ఎన్నో పథకాలు అమలు చేయడమే కాకుండా గతంలో ఎవరూ చేయని విధంగా అభివృద్ధి పనులు కూడా చేపడుతోంది. పూర్ణామార్కెట్‌లో ఫుట్‌పాత్‌లు, దుకాణాల ఆధునికీకరణ, విద్యుత్ సదుపాయంతో పాటు పరిసర ప్రాంతాల్లో రహదారి నిర్మించడంతో మేమంతా సంతోషంగా వ్యాపారాలు చేసుకుంటున్నాం.

–గోవింద్, పండ్ల వ్యాపారి, పూర్ణామార్కెట్.

జగనన్నతోనే సాధ్యం..



మా ప్రాంత సమస్యలు ఎవరికి చెప్పినా పరిష్కారం అయ్యేవి కాదు. కొన్ని సంవత్సరాలుగా సరైన రహదారి లేక, మురుగు సమస్య వదలక ఇబ్బంది పడ్డాం. ఇప్పుడు జగనన్న ప్రభుత్వం వచ్చి రోడ్లు వేశారు.. యూజీడీ సమస్య పరిష్కరించారు. ఇది జగనన్నకే సాధ్యమైంది.

–రాజేశ్వరి, సున్నం ముగ్గు వ్యాపారి, పూర్ణామార్కెట్.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం..



రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా జగనన్న పాలన సాగిస్తున్నారు. వార్డులో సమస్యలన్నీ ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తాం.

–విల్లూరి భాస్కరరావు, కార్పొరేటర్, 35వ వార్డు.

ఎస్సై సస్పెన్షన్ కోరుతూ నిరసన



నిరసన తెలుపుతున్న దళిత సంఘాల ప్రతినిధులు

డాబాగార్డెన్స్: స్వామీజీ ముసుగులో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ జ్ఞానానంద స్వామిపై చర్యలు చేపట్టాలని మహిళ, విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న సమయంలో మహిళా సంఘం నేత, దళిత మహిళ వనజాక్షిపై చేయి చేసుకున్న ఎంవీపీ పోలీస్ స్టేషన్ ఎస్సై దివ్యజ్యోతిని సస్పెండ్ చేయాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం డాబాగార్డెన్స్ కూడలిలో గల బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నేతలు బాధితురాలు వనజాక్షితో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ న్యాయం కోసం పోరాడుతున్న వారి పట్ల దురుసుగా ప్రవర్తించి, దాడికి దిగడం ఏమిటని ప్రశ్నించారు. సాటి మహిళా అధికారిగా బాధిత బాలిక పక్షాన నిలబడాల్సిన అధికారి స్వామీజీకి వత్తాసు పలకడం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. వనజాక్షి దళిత మహిళ అని, దాడికి పాల్పడ్డ ఎస్సై దివ్యజ్యోతిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు జి. రాంబాబు, కొత్తపల్లి వెంకటరమణ, నాగరాజు, బాధిత మహిళ వనజాక్షి, దేవుడమ్మ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చర్చి ప్రతినిధుల సమావేశం



జోనల్ సమావేశంలో పాల్గొన్న ఫాదర్ ముద్దు బాలస్వామి తదితరులు

డాబాగార్డెన్స్: ఏపీ ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చెస్ జోనల్ సమావేశం గురువారం నగరంలోని మహారాణిపేటలో గల ఆర్చ్ బిషప్ క్యాంపస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ క్రిస్టియన్ మైనార్టీ కమ్యూనిటీ ప్రభుత్వ సలహాదారు ఫాదర్ ముద్దు బాలస్వామి, సంఘమిత్ర డాక్టర్ ఆర్‌ఎస్ జాన్, బిషప్ కేజే ఫిల్మన్‌ను జోనల్ రిప్రజంటేటివ్‌లుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బిషప్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్, డేవిడ్ విక్టర్, విల్సన్‌బాబు, ఎంపీ నాయుడు, ఎస్‌జే రత్నకుమార్, కుమార్, వీకే జేమ్స్, కృపానంద్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో రికార్డుల పరిశీలన



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం పెందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల వాలిమెరక గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అమలులో సిబ్బంది అంకితభావంతో పని చేయాలన్నారు. అనంతరం పెందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలించారు. గర్భిణుల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి తగిన సలహాలు ఇవ్వాలన్నారు. ఐరన్ మాత్రలు, పోషకాహారంపై వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎస్.రమారెడ్డి తదితరులు పాల్గొన్నా రు.

డిగ్రీ సర్టిఫికెట్ల పరిశీలనకు నేడు గడువు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరీకి చెందిన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ గడువు శుక్రవారంతో ముగియనుంది. విద్యార్థులు తమ సర్టిఫికెట్లను సాయంత్రం 5 గంటల్లోగా పరిశీలన చేయించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. మరిన్ని వివరాలకు 63058 72717 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అవ్వాతాతలకు కంటి వెలుగు

అంధత్వ నివారణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. పథకం ఇప్పుడు మంచి ఫలితాలు ఇస్తోంది. కంటి చూపు సమస్యతో బాధపడుతున్న ఎంతో మంది వృద్ధులకు చూపు ప్రసాదిస్తోంది.

- వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా వృద్ధులకు నేత్ర పరీక్షలు
- జిల్లాలో 21,180 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తింపు
- 17,249 మందికి పంపిణీ



ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల

మహారాణిపేట : డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తుంది. శస్త్ర చికిత్సలు, కళ్లజోళ్లు, మందులు ఉచితంగా పంపిణీ చేస్తోంది.

వృద్ధులతో మొదలు

వృద్ధుల కంటి సమస్యలు మొదటి దశలోనే గుర్తించి చికిత్స చేస్తే సమస్య నుంచి బయటపడవచ్చు. ప్రత్యేక శిబిరాలు, ఆస్పత్రుల్లో కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తద్వారా కంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తిస్తున్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో 60 సంవత్సరాలు పైబడిన అవ్వాతాతలు 2,18,446 మంది ఉన్నట్టు గుర్తించారు. వీరిలో 1,33,622 మందికి వైద్య పరీక్షలు చేశారు. 21,180 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి, 17,249 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. మిగిలిన వారికి కూడా కళ్లద్దాలు సిద్ధం చేశారు. లబ్ధిదారులు వచ్చి కళ్లద్దాలు తీసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. 7,776 మందికి కేటరాక్టు శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. వీరిలో 3394 మందికి శస్త్ర చికిత్సలు చేశారు. పలు ప్రైవేటు ఆస్పత్రుల సహకారంతో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు.



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వృద్ధులకు పరీక్షలు



మూడు విడతల్లో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద వృద్ధులందరికీ కంటి పరీక్షలు పూర్తి చేశాం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అవ్వా–తాతలకు కళ్ల జోళ్లు ఇచ్చాం. కంటికి శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నాం. ఎన్‌జీవో సహకారంతో లబ్ధిదారులను గుర్తించే కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమం ఆగస్టు వరకు అమల్లో ఉంటుంది.

డాక్టర్ జగదీశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి


అవసరమైన వారికి శస్త్ర చికిత్స చేస్తున్నాం..



కంటి వెలుగు కార్యక్రమంలో అవ్వాతాతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, ఆస్పత్రికి వచ్చే వారికి కంటి వెలుగు కార్యక్రమం గురించి అవగాహన కల్పించడం చేస్తున్నాం. పరీక్షల అనంతరం అవసరం అయితే శస్త్ర చికిత్సలు, కేటరాక్టు ఆపరేషన్లు కూడా చేస్తున్నాం.

– డాక్టర్ విశ్వమిత్ర, సూపరింటెండెంట్, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి

గ్రంథాలయాన్ని వినియోగించుకోండి



అల్లిపురం శాఖా గ్రంథాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న వెంకటరావు

అల్లిపురం: జిల్లా గ్రంథాలయ సంస్థ అనుబంధ గ్రంథాలయమైన అల్లిపురం శాఖా గ్రంథాలయాన్ని అందరూ వినియోగించుకోవాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు కోరారు. గురువారం ఆయన జిల్లా గ్రంథాలయ సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వార్షిక రికార్డులు పరిశీలించి వాటి నిర్వహణ తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. నూతన సభ్యత్వాలు సభ్యులు సేకరించాలని తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారంతా గ్రంథాలయంలో ఉన్న పోటీ పరీక్షల గ్రంథాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవలో 32 మంది ఉభయదాతలు, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీ హోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజల్లో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎం. ధనలత, సతీష్, ఎస్‌ఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

డ్రగ్స్, ఆల్కహాల్ దుష్పరిణామాలపై సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అండ్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శేషమ్మ

డాబాగార్డెన్స్: నగరంలోని ఏవీఎన్ కళాశాలలో గురువారం ఎస్‌ఎంబీఏ నషా ముక్త్ భారత్ అభియాన్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డ్రగ్ డిమాండ్ రిడక్షన్ యాక్షన్ ప్లాన్‌పై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు విద్యార్థులనుద్దేశించి డ్రగ్స్, ఆల్కహాల్ దుష్పరిణామాలపై వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి అండ్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎంవీ శేషమ్మ, అసిస్టెంట్ డైరెక్టర్ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ ది డిఫరెంట్లీ ఏబుల్డ్, ట్రాన్స్‌జెండర్ అండ్ సీనియర్ సిటిజన్స్ జె. మాధవి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జగదీష్, మానసిక వైద్యురాలు డాక్టర్ మాధవీలత, ఎన్జీవో ఎస్‌ఈఈడీ సెక్రటరీ వీఎస్ రాజు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీజే శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు, కరస్పాండెంట్ ఏవీ ఆదీప్ భానోజీరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సే టు నో డ్రగ్స్ నినాదాన్ని అందరికీ వ్యాప్తి చేయాలని విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ నివారణకు సంబంధించి టోల్‌ఫ్రీ నంబరు 1098 గురించి తెలిపారు. డ్రగ్స్ నుంచి ఎలా బయటపడాలో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి. కృష్ణకుమారి, డి. సంతోష్‌కుమార్, ఎం. స్వరాజ్యలక్ష్మి, కె. ఇందిర, సీహెచ్ మల్లిక, జి. సునీత, డి. అనిత, బి. లావణ్య, బి. నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్‌పై అవగాహన



ప్లాస్టిక్‌పై టర్నర్ చౌల్ట్రీ దుకాణాల వద్ద అవగాహన కల్పిస్తున్న అధికారులు

డాబాగార్డెన్స్: నిషేధిత ప్లాస్టిక్‌పై జోన్–4 ఏఎంవోహెచ్ గురువారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా టర్నర్ చౌల్ట్రీలో ఏర్పాటు చేసిన దుకాణాలు, అక్కడికి విచ్చేసిన భక్తులకు నిషేధిత ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తూ, ప్లాస్టిక్‌ను వాడరాదని తెలిపారు. అనంతరం లేపాక్షి జంక్షన్ నుంచి పూర్ణామార్కెట్ వరకు నిషేధిత ప్లాస్టిక్‌పై ప్రతి దుకాణం వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌ను విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు నేతృత్వంలో నగరంలో ప్రత్యేక బృందాలు తిరుగుతున్నాయని, ప్లాస్టిక్ విక్రయిస్తున్న పలు దుకాణాల నుంచి అపరాధ రుసుం వసూలు చేసినట్లు చెప్పారు. అవగాహన కార్యక్రమంలో 30వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు వినతి



డీడీ రామారావుకు వినతిపత్రం అందిస్తున్న విదసం ఐక్య వేదిక కన్వీనర్ డాక్టర్ వెంకటరావు

ఎంవీపీ కాలనీ: ప్రభుత్వ బాలికల వసతిగృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విదసం ఐక్య వేదిక కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు కోరారు. ఈ మేరకు ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్‌లో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని బాలికల వసతి గృహాల్లో మరింత భద్రత పెంచాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులకు అందించే సౌకర్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. జిల్లాలో ఉన్న పలు సాంఘిక సంక్షేమ శాఖ స్థలాలకు పూర్తి రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విదసం ప్రతినిధులు హరిబాబు, సుజాత, నిర్మల, కస్తూరి వెంకటరావు, బల్ల కుమార్, సుదర్శనం, తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీని సందర్శించిన ఇరాక్ దేశస్తులు



ఇరాక్ దేశస్తులను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఇరాక్ దేశ విద్యా మంత్రిత్వ శాఖ ఇంగ్లిష్ లాంగ్వేజ్ కరికులం విభాగాధిపతి, ఏయూ పూర్వ విద్యార్థిని హింద్ ఫరూక్ ఆలీ గురువారం సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఏయూ పూర్వ విద్యార్థిగా వర్సిటీలో అభివృద్ధి జరుగుతున్న తీరు తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ తరఫున ఫరూక్ ఆలీని వీసీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

25న ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో సెవెన్ హిల్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఈ నెల 25న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు.